సాక్షి
శ్రీకాకుళం
సోమవారం, 8, జనవరి, 2024



సంక్రాంతి బస్సులు..

సంక్రాంతికి ఆర్టీసీ అదనపు బస్సులు సిద్ధం చేసింది. సాధారణ చార్జీలతోనే వీటిని నడపనుంది. - 8లో



ఆటో బోల్తా..

బూర్జ మండల పరిధిలో ఆటో బోల్తా పడింది. ఏడుగురు గాయపడ్డారు. - 8లో



ఉత్సాహంగా తైక్వాండో పోటీలు

జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని టౌన్‌హాల్‌లో పోటీలు జరిగాయి. - 8లో

న్యూస్‌రీల్

10న జిల్లా జూనియర్స్ కబడ్డీ జట్ల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా జూనియర్స్ కబడ్డీ జట్ల ఎంపికలను ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం జిల్లా కబడ్డీ, బీచ్ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మాన రామలింగంనాయుడు, సాదు శ్రీనివాసరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ మొదలవుతుందని చెప్పారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2004 ఫిబ్రవరి 4వ తేదీ తర్వాత జన్మించి ఉండాలని, బాలురు 75 కేజీలు, బాలికలు 65 కేజీల్లోపు బరువు ఉండాలని, 20 ఏళ్లలోపు వయస్సు ఉండాలని స్పష్టం చేశారు. ఎంపికైన జిల్లా జట్లను కర్నూలు జిల్లా నంద్యాలలో ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 94419 14214 నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

తేజ లక్ష్మికి బంగారు పతకం



బంగారు పతకం పొందిన పల్లె తేజలక్ష్మి

ఆమదాలవలస: రాజమహేంద్రవరంలో ఆంధ్ర సరస్వత కళాపరిషత్ నారాయణ భట్టు వేదికపై నిర్వహించిన తెలుగు మహాసభల్లో ఆమదాలవలసకు చెందిన అంధురాలు పల్లె తేజలక్ష్మికి బంగారు పతకం లభించింది. ఈ మేరకు ఆమె ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలుగు జాతి వైభవం అనే కవిత చదివినందుకు గాను ఈ ప్రశంసా పత్రంతో పాటు బంగారు పతకం అందినట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం ఈమె జలుమూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

వేంకటేశ్వర స్వామికి పుష్పార్చన



వెంకటేశ్వర స్వామికి పుష్పార్చన చేసిన దృశ్యం

నరసన్నపేట: స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి ఆదివారం సాయంత్రం పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. ధనుర్మాసంలో మార్గశిర బహుళ ఏకాదశి (సఫల ఏకాదశి) సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు కృష్ణ బాబు తెలిపారు.

గురుకులం ఏర్పాటుకు వినతి



స్వామీజీలతో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును ఆదివారం పెదపాడులోని ధర్మాన క్యాంప్ కార్యాలయంలో స్వామినారాయణ గురుకులం స్వామిజీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా గల గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాకుళంలోని స్వామినారాయణ గురుకులం ఏర్పాటు చేసేందుకు పది ఎకరాలు ప్రభుత్వ స్థలం కావాలంటూ మంత్రి ధర్మానకు విన్నవించారు.

పలాసలో జాతీయ స్థాయి ఆటల పండగ

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదికగా తొలిసారి జాతీయ స్థాయి ఆటల పండగ నిర్వహించనున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 13 వరకు రాష్ట్ర టెన్నీ కాయిట్ సంఘ ఆధ్వర్యంలో జిల్లా సంఘ నిర్వహణలో సీనియర్ జాతీయ టెన్నీ కాయిట్ చాంపియన్ షిప్ (పురుషులు, మహిళలు) జరగనుంది. ఈ పోటీలకు కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.తవిటయ్య వ్యవహరించనున్నారు. ఈయన రాష్ట్ర సంఘ కోశాధికారిగా, జిల్లా సంఘ కార్యదర్శిగా ఉన్నారు. పలాస జాతీయ పోటీలకు వేదికగా నిలవడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. ఇక్కడే ఆటల్లో ఓనమాలు నేర్చుకుని జాతీయ పోటీల నిర్వహణ బాధ్యత చూసే అవకాశం రావడం అదృష్టమని అన్నారు.

నోరు జారనేల..

- అధ్యక్ష హోదాలో ఉన్నా అచ్చెన్నాయుడికి దక్కని గౌరవం
- ఆయనతో మాటైనా చెప్పకుండా అధిష్టానంతో సంప్రదింపులు
- నేరుగా లోకేష్‌నే సంప్రదిస్తున్న ఆశావహులు
- చేటు తెచ్చిన అనుచిత వ్యాఖ్యలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

నోరు బాగుంటే ఊరు బాగుంటుందని అంటారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పరిస్థితే అందుకు ఉదాహరణ. పార్టీ లేదు.. బొక్కా లేదు అని, ఆడే బాగుంటే మనకెందుకీ పరిస్థితి అని ఇష్టానుసారం నోరు పారేసుకున్నారు. ఆ ప్రభావం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. పేరుకు రాష్ట్ర అధ్యక్షుడే అయినా జిల్లాలో ఎమ్మెల్యే సీటు ఆశిస్తున్న వారు కనీసం ఆయనను సంప్రదించడం లేదు. పైగా అచ్చెన్న పేరు చెప్పుకుని అధిష్టానం వద్దకు వెళ్తే సీటు గల్లంతే అన్న నిర్ణయానికి వచ్చేశారు. మరీ ముఖ్యంగా లోకేష్ 'అచ్చెన్న అనుచరుడు' అని ముద్ర ఉన్న వారిని ప్రత్యేకంగా గమనిస్తున్నారని, దీనిపై ఆరా తీసే బాధ్యతను కూడా కళా వెంకటరావు తదితర నేతలకు అప్పగించారని ఆ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు. దీంతో జిల్లాలో టీడీపీ టికెట్ ఆశిస్తున్న వారు అచ్చెన్న ప్రమేయం లేకుండా లోకేష్‌తోనే సంప్రదింపులు జరుపుతున్నారు.

చేటు తెచ్చిన మాట..

లోకేష్‌పై అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు, ఇటీవల చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు ప్రజల నుంచి స్పందన రాలేదంటూ ఫోన్ కాన్ఫరెన్స్‌లో చేసిన వ్యాఖ్యలు...తనకు సమకాలీనులైన నాయకుల వద్ద లోకేష్‌పై మాట్లాడిన తీరు.. అన్నీ కలిపి ఇప్పుడు ఆయనపై గట్టిగానే ప్రభావం చూపిస్తున్నాయి. పార్టీని, తనను బదనాం చేసిన అచ్చెన్నాయుడు వ్యాఖ్యలను లోకేష్ సీరియస్‌గా తీసుకున్నారు. ఇప్పటికిప్పుడు అచ్చెన్నాయుడుపై వేటేస్తే పార్టీకి ఇబ్బంది అని వేచి చూస్తూనే.. వ్యక్తిగతంగా అచ్చెన్నాయుడిని టార్గెట్ చేసినట్లు సమాచారం. అందులో భాగంగా పార్టీలో అచ్చెన్నాయుడు మాటకు విలువ లేకుండా చేయడంతో పాటు ఆయన అనుచరులుగా పార్టీ టిక్కెట్ ఆశించే వారికి మొండి చేయి చూపే విధంగా లోకేష్ పావులు కదుపుతున్నట్టు పార్టీలో చర్చ నడుస్తోంది. దీంతో అచ్చెన్న పేరు చెప్పుకుని టిక్కెట్ అడిగేందుకు ఆశావహులు సాహసించలేకపోతున్నారు.

వాస్తవంగా ఈ సారి ఎన్నికల్లో పాతపట్నం, పలాస, నరసన్నపేట, శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో టీడీపీలో నెలకున్న అంతర్గత విభేదాల కారణంగా సీట్ల కేటాయింపు విషయంలో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో పార్టీ అధ్యక్షుడి హోదాలో అచ్చెన్నాయుడును వెంటబెట్టుకుని అధిష్టానం వద్ద ప్రయత్నాలు సాగించాలి. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. టిక్కెట్ కోసం అచ్చెన్నాయుడు వ్యతిరేక వర్గంగా నిలిచిన లోకేష్ అనుచరులతో పావులు కదుపుతున్నారు. ముఖ్యంగా కళా వెంకటరావుతో టచ్‌లోకి వెళ్తున్నారు. ఆ తర్వాత కూన రవికుమార్ ద్వారా యత్నాలు సాగిస్తున్నారు.. వీరిద్దరూ లోకేష్‌తో బాగా టచ్‌లో ఉన్నారు. చెప్పాలంటే అచ్చెన్నకు పోటీగా లోకేష్ వీరిని ప్రోత్సహిస్తున్నట్టు సమాచారం. జిల్లాలో ఏం జరిగినా లోకేష్‌కు ఇట్టే సమాచారం ఇస్తున్నారు. అచ్చెన్నతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్న నేతలెవరో చెప్పే బాధ్యతను తీసుకున్నట్టుగా పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. దీనికంతటికీ తిరుపతి లోకసభ ఉప ఎన్నికల సమయంలో లోకేష్‌పై అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలే కారణమని చర్చించుకుంటున్నారు. అచ్చెన్నాయుడు చెప్పిన మనషులకు టిక్కెట్ ఇచ్చే పరిస్థితి లేదని, కాస్తో కూస్తో ఎంపీ రామ్మోహన్‌నాయుడు చెప్పినోళ్లకైనా ప్రాధాన్యత ఇస్తారేమో గాని అచ్చెన్నాయుడు సిఫార్సు చేసే వ్యక్తులకు ఛాన్సే లేదని స్పష్టమైన సంకేతాలు ఉన్నాయి. దీంతో అచ్చెన్నాయుడుతో కలిసి వెళ్లడానికి, ఆయన సిఫార్సులతో టిక్కెట్ కోసం ప్రయత్నించడానికి జిల్లాలోనే కాదు చుట్టు పక్కల జిల్లాల నుంచి ఏ ఒక్కరూ ఆసక్తి చూపడం లేదు. ఎన్నికల తర్వాత అచ్చెన్నను పూర్తిగా అణగదొక్కడానికి లోకేష్ ప్రణాళిక సిద్ధం చేశారని పార్టీ వర్గాల ద్వారా వినిపిస్తోంది.

● వివక్ష లేని పాలన..



చిత్రంలో పింఛన్ అందుకుంటున్న వ్యక్తి పేరు నిక్కు రాము. సారవకోట మండలం బుడితి గ్రామానికి చెందిన ఈయన టీడీపీ నాయకుడు. మాజీ సర్పంచ్ కూడా. అయినా ఎలాంటి వివక్ష చూపకుండా ఆయనకు పింఛన్ మంజూరు చేశారు. కొత్తగా మంజూరైన పింఛన్‌ను డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్ తదితరులు ఆయనకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. - సారవకోట

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులతో పాటు జిల్లా వ్యాప్తంగా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఏర్పాట్లు చేయగా, అంతరాలయంలో స్వామి వారి దర్శనం అందరికీ జరిగేలా ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు చర్యలు చేపట్టారు. తెలంగాణకు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి ఎస్.హరీష్ కుటుంబసమేతంగా ఆదిత్యుడిని దర్శించుకున్నారు. తొలిసారిగా అరసవల్లి క్షేత్రానికి రావడంతో వీరికి ఈఓ హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు ప్రత్యేకంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం హరీష్ దంపతులు ప్రత్యేకంగా సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. ఈయన వెంట ఆలయ పాలకమండలి సభ్యులు ఎస్.కోటేశ్వర చౌదరి, ఆర్డీవో రంగయ్య, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తదితరులున్నారు. అలాగే సెంట్రల్ రైల్వే ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ (సిఆర్ఐఎస్) ప్రధానాధికారి గంధం సత్యకుమార్ కూడా స్వామిని దర్శించుకోగా అధికారులు ఆలయ మర్యాదలు చేశారు. వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.68,300, విరాళాల ద్వారా రూ.95,300, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,80 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఈఓ తెలిపారు.



ఆదిత్యుని జ్ఞాపికను రైల్వే ఉన్నతాధికారి సత్యకుమార్‌కు అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

ముగిసిన చెకుముకి సైన్స్ సంబరాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: మానవాళి దైనందిన జీవితం సైన్స్‌తోనే ముడిపడి ఉంటుందని టెక్కలి ఉప విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఘనంగా జరిగాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆమె బహుమతులు అందజేశారు. పోటీలకు 65 టీమ్‌ల నుంచి 195 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు రెండు విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందజేశారు. అంతకు ముందు ప్రశ్న పత్రాన్ని విశ్రాంత డీవైఈఓ కొత్తకోట అప్పారావు, జిల్లా సైన్స్ అధికారి ఎస్.కుమారస్వామి, ఏపీపీఎస్టీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సాయి శ్రీనివాస శర్మ, గొంటి గిరిధర్ ఆవిష్కరించారు. అనంతరం సైంటిస్టులతో కూడిన ఫొటో ఎగ్జిబిషన్‌ను జేవీవీ జిల్లా అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కుర్మారావు, జిల్లా కోశాధికారి వీఎస్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయులు సీహెచ్ ఉమామహేశ్వరరావు ప్రదర్శించిన సైన్స్ మ్యాజిక్ విద్యార్థులను ఆకట్టుకుంది. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల శ్రీకాకుళం(ప్రథమ), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దదూగాం జలుమూరు మండలం (ద్వితీయ), ప్రభుత్వ ఉన్నత పాఠశాల కవిటి (తృతీయ), మహాత్మ జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నరసన్నపేట (తృతీయ), ఏపీ మోడల్ స్కూల్ జి.సిగడాం(నాల్గో) విజేతలుగా నిలిచాయి. ప్రైవేటు పాఠశాల విభాగం నుంచి గీతాంజలి స్కూల్ శ్రీకాకుళం (ప్రథమ), ఆర్థర్ స్కూల్ రణస్థలం (ద్వితీయ) విజేతలుగా నిలిచాయి.



విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీవైఈఓ పగడాలమ్మ, తదితరులు

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు సాందీప్‌శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం మార్గశిర బహుళ ఏకాదశి సందర్భంగా ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీ వారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మూర్తులుగా అనివేటి మండపంలో వేంచేసింప జేశారు. అనంతరం ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం కల్యాణ సేవకు హాజరైన భక్త దంపతులకు శేష వస్త్రాలతో పాటు తలంబ్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ హరిసూర్యప్రకాష్, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

21న జిల్లా మాజీ సైనిక సంఘ సమాఖ్య ఎన్నికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా మాజీ సైనిక సంఘ సమాఖ్య, దాని అనుబంధ మండలాల మాజీ సైనిక సంఘాలు సంయుక్తంగా ఈనెల 21వ తేదీన నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహిస్తున్నట్టు ఆ సంఘ ఎన్నికల కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఎన్నికలు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని పెద్దరెల్లి వీధిలో ఉన్న జిల్లా సైనిక సంక్షేమ సంఘ కార్యాలయ ప్రాంగణంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ప్రధానంగా మాజీ సైనిక సంఘ సమాఖ్య అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, సహాయక కార్యదర్శి, కోశాధికారి, మహిళా కార్యదర్శి, కరస్పాండెంట్‌తోపాటు ఇతర మిగిలిన పదవులకు కూడా నామినేషన్ జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం జిల్లా మాజీ సైనిక సంఘ సమాఖ్యలో ఉన్న సభ్యులతోపాటు దీనితో అనుబంధం ఉన్న యూనియన్ సభ్యులు మాత్రమే పోటీ చేయడానికి అర్హులని చెప్పారు. అలాగే బరిలో నిలిచే అభ్యర్థులు శ్రీకాకుళం నగరానికి 15 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తూ ఉండాలని, అలాగే ఉద్యోగిగా చేసిన, వ్యాపారం చేస్తున్న మాజీ సైనికులైనా ఫర్వాలేదని కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే వ్యక్తులు 2024 జనవరి 17వ తేదీ మధ్యాహ్నం 12 గంటలోపు జిల్లా మాజీ సైనిక సంఘ సమాఖ్య శ్రీకాకుళం కార్యాలయంలో నామినేషనల్ దాఖలు చేయాల్సి ఉంటుందని, అలాగే విత్‌డ్రా చేసుకునేవారు జనవరి 19 మధ్యాహ్నం 12 గంటల్లోపు చేసుకోవచ్చని ఎలక్షన్ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

నేడు వెయ్యి మందితో సూర్య నమస్కారాలు



అరసవల్లి: మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సూర్యనమస్కారాల కార్యక్రమాలను తలపెట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో భాగంగా స్థానిక ఆయుష్ శాఖాధికారుల ఆధ్వర్యంలో వెయ్యి మందితో సూర్యనమస్కారాల కార్యక్రమాన్ని అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఇంద్రపుష్కరిణి ఆవరణలో నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం 8 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కానుందని ఆయుష్ వైద్యులు పి.జగదీష్, టి.మహతి, వి.సీతామహాలక్ష్మి, ఎస్.లక్ష్మీ ప్రసన్నలు తెలియజేశారు. అలాగే ఇదే ప్రాంగణంలో ఆయుష్ శాఖ వారి ఆయుర్వేద, హోమియో వైద్య ఉచిత శిబిరాన్ని కూడా నిర్వహిస్తున్నామని ప్రకటించారు.

అలరించిన కళా ప్రదర్శన



బోనెల అసిరయ్య పాట వింటున్న గిరిధర్ గొమాంగో



డప్పు కొడుతున్న గిరిధర్ గొమాంగో

పలాస: రంగోయి గ్రామంలో ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగో జుగల్ బందీ కార్యక్రమం ఆద్యంతం అలరించింది. గిడుగు రామ్మూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం ఆధ్వర్యంలో ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బద్రి కూర్మారావు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గిరిధర గొమాంగో ముఖ్య అతిథిగా పాల్గొని కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. తన డప్పు వాయిద్యంతో ఆహూతులను ఆకట్టుకున్నారు. అతి ప్రాచీన గిరిజన వాయిద్య పరికరాలను ప్రజలకు పరిచయం చేశారు. హైదరాబాద్, రాయలసీమ, శ్రీకాకుళంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కార గ్రహీత, జానపద కళారత్న డాక్టరు చిగిచర్ల కృష్ణారెడ్డి, అంతర్జాతీయ జానపద శాస్త్రీయ నృత్య కళాకారి డాక్టరు కె.నిర్మలాదేవి, రాయలసీమ జానపద గాయకురాలు అనంత ఆణి ముత్యం అమృత రత్న, డాక్టర్ కె.చిరంజీవి, కళింగ సీమ సాహితీ సంస్థ అధ్యక్షుడు ప్రజాగాయకుడు సన్నశెట్టి రాజశేఖర్, కళాకారులు పాల్గొన్నారు.

కొత్తరకం వరి అదిరింది

- నీటి ఎద్దడి పరిస్థితుల్లోనూ చక్కటి దిగుబడులిచ్చిన యూటీఆర్ 181 రకం వరి
- ఉద్దానం బీల ప్రాంతానికి అనువైన రకంగా రైతుల ఆనందం
- అత్యంత సన్నరకం ధాన్యం కావడంతో ధరలోనూ కలిసివచ్చే అంశం



కవిటి ఉద్దానం బీల ప్రాంతంలో పండిన యూటీఆర్181 వరిపైరు

కవిటి: రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సహాయ సహకారాలలో కవిటి ఉద్దానం ప్రాంతంలో అన్నదాతలు కొత్తరకం వరివంగడాల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. కవిటి మండలంలోని పలువురు రైతులు ఉటుకూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో అభివృద్ధి చేసిన నూతన రకం వరివంగడం యూటీఆర్181ను సాగు చేసి మంచి దిగుబడులు సాధించారు. ఈ విత్తనాల్ని కృష్ణాజిల్లాకు చెందిన రైతు ఉప్పల హరిప్రసాద్ నుంచి కవిటి మండలానికి చెందిన పలువురు రైతులు సొంతఖర్చులతో తీసుకొచ్చారు. 150–160 రోజుల పంటకాలం కలిగిన ఈ పంటను ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేశారు. కేవలం 20 కిలోల విత్తనం ఎకరం విస్తీర్ణంలో పొలంలో సంప్రదాయ పద్ధతిలో నాట్లు వేశారు.

లోడెన్సిటీ పద్ధతిలో సాగు చేయాలని యూట్యూబ్‌లో పరిశీలించిన రైతులు ఆ విధంగానే తక్కువ విత్తన ఖర్చుతో నారుమడులు సిద్ధం చేసుకున్నారు. ఒక్కో చిగురు మాత్రమే నాటడంతో దాని నుంచి 20 పిలకలకు పైగా అది అభివృద్ధి చెందింది. దుబ్బుచేసింది. పచ్చిరొట్ట పైరువేసి దమ్ము చేసి ప్రధాన పొలంలో నత్రజని పైపాటుగా వేసే అవసరం లేకుండానే సాగుచేశారు. పంటకాలం మధ్యలో స్వల్పమోతాదులో మిశ్రమ ఎరువును పైపాటుగా అందించారు. నత్రజని వినియోగం లేని కారణంగా చీడపీడల బెడద తప్పింది. ఇటీవలే కోతలు కూడా పూర్తయ్యాయి. ఎకరానికి 30 నుంచి 35 బస్తాల దిగుబడి సాధించినట్టు రైతులు చెబుతున్నారు. సాగునీటి లభ్యత బాగా ఉండే ప్రాంతానికి మంచి అనువైన రకంగా రైతులు భావిస్తున్నారు. చేను కూడా ఏపుగా ధృడంగా ఉండడంతో వరదలు, అధిక వర్షాల ధాటికి కూడా తట్టుకునే వీలుందని భావిస్తున్నారు. విత్తనాలు అవసరమైన రైతులు తమను సంప్రదిస్తే విత్తనాలు కూడా సరసమైన ధరకే అందించేందుకు సిద్ధమని రైతులు చెబుతున్నారు.



తెగుళ్లను తట్టుకుంది



ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఎదురైనా మండలంలో సాగుచేసిన యూటీఆర్181 రకం వరి ఖరీఫ్‌లో మంచి దిగుబడులు అందించింది. 34 బస్తాల వరకు దిగుబడులు వచ్చినట్టు రైతులు చెబుతున్నారు. ప్రధానంగా అగ్గితెగులు, దోమపోటు, పాముపొడతెగులు వంటి చీడపీడల బెడద ఈ పైరుకు ఆశించకపోవడం మంచి పరిణామం. ఉద్దానం ప్రాంతానికి ఇది అనువైన రకంగా కనిపించింది.

– కె.జగన్మోహనరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు, సోంపేట సబ్‌డివిజన్.

కొత్త రకం పంట పండింది



మా నాన్న నన్ను డిగ్రీవరకు చదివించారు. వ్యవసాయం మా ప్రధాన వృత్తి. ప్రతి ఏటా కొత్తరకం వరి విత్తనాలు సాగుచేయడం నాకు అలవాటు. ఈ ఏడాది కృష్ణాజిల్లా నుంచి యూటీఆర్181 రకం వరివిత్తనాలు తెప్పించాం. పంట పండింది. నా మొబైల్ నంబర్9951396558. విత్తనాలు అవసరమైతే సంప్రదించవచ్చు.

– బెందాళం వరప్రసాద్, ప్రగడపుట్టుగ, కవిటి మండలం

క్లుప్తంగా

రెడ్డిక కుల సంఘ భవన నిర్మాణానికి విరాళాలు



సుమతి రెడ్డికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో రెడ్డిక కులస్తుల కోసం భవన నిర్మాణం చేస్తుండడం శుభ పరిణామమని చిత్తూరు జిల్లా భక్త మల్లారెడ్డి గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సుమతి రెడ్డి అన్నారు. జిల్లా రెడ్డిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివా రం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆమె భవన నిర్మాణానికి రూ.2లక్షల విలువచేసే రెండు బంగారు గాజులు అందజేశారు. అంపోలు జిల్లా జైల్‌కి సమీపంలోని రెడ్డిక భవనం నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మెళియాపుట్టి గ్రామానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు దుక్క రాజన్న రెడ్డి మనవడు దుక్క మధుసూదన్ రెడ్డి రూ.లక్ష విరాళం ప్రకటించారు. బుచ్చ రామకృష్ణారెడ్డి అనే రిటైర్డ్ ఇంజినీర్ నిర్మాణంలో తన బా ధ్యతగా ఒక గదిని నిర్మిస్తానని ప్రకటించారు. దాంతోపాటు రెండు లక్షలు ఇచ్చారు. సంతబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యులు పాల వసంతరెడ్డి రూ. 3 లక్షలు, ప్రొఫెసర్ దూడ విష్ణుమూర్తి రెడ్డి రూ.1.20లక్షలు, జిల్లా రెడ్డిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు బల్లాడ జనార్దన్ రెడ్డి బ్రదర్స్ తల్లిదండ్రులు జ్ఞాపకార్థం రూ.5లక్షలు, అలపాన త్రినాథ రెడ్డి రూ.10వేలు అందించారు. ఈ సందర్భంగా సుమతీ రెడ్డి ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో తిరుపతిలో జరగబోయే యానివర్స్–డే వేడుకలకు జిల్లాలో ఉన్న రెడ్డిక కుల పెద్దలు హాజరవ్వాలని కోరారు. కార్యక్రమంలో దుక్క రాజశేఖరరెడ్డి, బాకీ వేణుగోపాల్‌రెడ్డి, బార్ల నాగభూషణ్‌రెడ్డి, మునకాల కిరణ్ రెడ్డి, బస్వా రాజేష్ రెడ్డి, భోజరాజు రెడ్డి, అపోజి రెడ్డి, పి.సుగుణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాలయ ప్రతిష్టతో పెరిగిన విలువలు



ప్రసంగిస్తున్న వక్తలు

శ్రీకాకుళం కల్చరల్: అయోధ్యలో రామాలయ ప్రతిష్టతో మన విలువలు మరింత పెరిగాయని ఆర్‌ఎస్‌ఎస్ సహక్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్ అన్నారు. స్థానిక పీఎస్‌ఎన్‌ఎం హైస్కూల్‌లో సూర్యతేజం కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 22న జరగనున్న రామాలయ ప్రతిష్ఠాపన ఉత్సవాల సమయంలో అందరూ ఇంటిపై జెండాలు ఎగురవేయాలని, దీపాలను వెలిగించాలని సూచించారు. జిల్లా సంఘ సేవక్ పీవీ రమణమూర్తి, ఐతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, విభాగ్ కార్యవాహక్ డీవీ రమణమూర్తిలు మాట్లాడుతూ ఎంతో ఉన్నతమైన సంప్రదాయాలతో కూడినది మన దేశం అన్నారు. మన దేశంలో స్త్రీకి అత్యున్నత స్థానం కల్పించామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి జారి పడి తాపీమేస్త్రీ మృతి

కంచిలి: మండలంలోని ముండ్ల పంచాయతీ పరిధి కేశుపురం గ్రామానికి చెందిన నిరంజన్ ప్రధాన్(59) జిల్లుండ గ్రామంలో సీలాద్రి ప్రధా న్ ఇంటి నిర్మాణ పని చేస్తుండగా, ప్రమాదవశాత్తూ సన్ షేడ్ మీద నుంచి శనివారం సాయంత్రం జారిపడ్డాడు. దీంతో తల వెనుక భాగంలో బలమైన గాయమైంది. దీంతో విశాఖపట్నం కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 7.35 గంటలకు మృతిచెందాడు. దీంతో మృతుని భార్య సత్యభామ ప్రధాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్‌ఐ ఎస్.బాలరాజు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీ, కారు ఢీ వ్యక్తి మృతి



రక్తమడుగులో వృద్ధుడు

కాశీబుగ్గ: పలాస మండలం శాసనాం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. విశాఖ నుంచి పశ్చిమ బెంగాల్ వెళ్తున్న ఓ కారు స్కూటీపై వెళ్తు న్న వృద్ధుడిని ఢీ కొట్టింది. ఆ ధాటికి కారు మూడు పల్టీలు కొట్టగా.. స్కూటీ నుజ్జునుజ్జయిపోయింది. వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తు న్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 108 సిబ్బంది వృద్ధుడిని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన మృతి చెందారు. ఘటనపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్రాంతి బస్సులు.. సాధారణ చార్జీలు

- సాధారణ చార్జీలతో ఆర్టీసీ అదనపు సర్వీసులు
- జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సు

శ్రీకాకుళం క్రైమ్ :

సంక్రాంతి పండగ సందర్భంగా సొంత గ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త అందించింది. రెగ్యులర్‌గా తిరిగే బస్సు సర్వీసులతో పాటు సాధారణ చార్జీలతోనే అదనంగా ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) ఎ.విజయ్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. అంతేకాక ప్రయాణికులు ఒకేసారి వచ్చిపోయేందుకు (రానుపోను) రిజర్వేషన్ చేసుకుంటే టికెట్ చార్జీలో పదిశాతం రాయితీ కూడా ఇవ్వనున్నట్లు చెప్పారు. పండగ రోజుల్లో హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం మీదుగా 24, విజయవాడ, రాజమండ్రి, అమలాపురం మీదుగా 15 అదనపు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విశాఖ టు ఇచ్ఛాపురం..

విశాఖపట్నం ద్వారకా బస్టాండ్ నుంచి శ్రీకాకుళం, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం వెళ్లేందుకు పది నిమిషాలకోసారి బస్సు. అలాగే రాత్రి 9:30 గంటల నుంచి వేకువజాము ఐదు గంటలలోపు ప్రతి గంటకో బస్సు నడవనున్నామని డీపీటీఓ అన్నారు. అవే కాకుండా రెగ్యులర్ సర్వీసులైన విజయవాడ నుంచి శ్రీకాకుళం డిపోకు నాలుగు, టెక్కలి డిపోకు రెండు, పలాస డిపోకు నాలుగు సర్వీసులు ఉన్నాయని పేర్కొన్నారు. విశాఖపట్నం ద్వారకా స్టేషన్‌లో 24 గంటలూ అధికారుల బృందంతో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేశామని, ప్రయాణికుల రద్దీకి, వారి అవసరాలకు అనుకూలంగా మరిన్ని ప్రత్యేక బస్సులు సిద్ధంగా ఉంచామని విజయ్‌కుమార్ తెలిపారు.

ప్రత్యేక బస్సులు నడుస్తాయిలా..

తేదీ	ఎక్కడి నుంచి ఎక్కడికి	నాన్‌ఏసీ	ఏసీ
11-01	హైదరాబాద్-శ్రీకాకుళం-పలాస	07	01
12-01	హైదరాబాద్-శ్రీకాకుళం-పలాస	09	00
13-01	హైదరాబాద్-శ్రీకాకుళం-పలాస	06	01
11-01	విజయవాడ-శ్రీకాకుళం-పలాస	08	00
12-01	రాజమండ్రి-శ్రీకాకుళం-పలాస	05	00
13-01	అమలాపురం-శ్రీకాకుళం-టెక్కలి	02	00

వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి



రైతులను సన్మానిస్తున్న గేదెల శ్రీనుబాబు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఉత్తరాంధ్రలో వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని పల్సస్ సంస్థ సీఈఓ గేదెల శ్రీనుబాబు అన్నారు. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను చైతన్యం చేసే దిశగా అడుగులు వేయాలన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఉత్తరాంధ్ర రైతు సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గేదెల శ్రీనుబాబుకు స్థానిక నాయకులు ఎడ్లబండ్లు, బైకు ర్యాలీతో సింహద్వారం వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ప్రధానాధారం వ్యవసాయమని, అందులో 90 శాతం మంది రైతులు సీజనల్ పంటలకే ప్రాధాన్యమిస్తున్నారని అన్నారు. సకాలంలో వర్షాలు కురవక, సాగునీరు అందుబాటులో లేక ఏటా ఆర్థికంగా కుదేలైపోతున్నారని తెలిపారు. పల్సస్ ద్వారా అధునాతన ఆవిష్కరణలకు తెర తీస్తున్నామన్నారు. సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులను మళ్లించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అందుకే రైతు విజ్ఞాన సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. డిజిటల్ మార్కెటింగ్‌పై కూడా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సదస్సులో రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్స్ కార్యదర్శి ఆనేపు రామకృష్ణ, జిల్లా తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు సురంగి మోహన్‌రావు, తూర్పు కాపు భవన నిర్మాణ కమిటీ కార్యదర్శి లంక గాంధీ, హారిక ప్రసాద్, రిటైర్డ్ జేసీ రెడ్డి గున్నయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్, లంక బావాజీ నాయుడు, లావేటి జగన్నాథం నాయుడు, ఎస్‌కే నాయుడు, శాసపు జోగినాయుడు, రామజోగినాయుడు, తూర్పు కాపు బిజినెస్ నెట్‌వర్క్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ గంట్యాడ మోహన్‌కృష్ణ, తూర్పు కాపు రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ సీపాన శ్రీనుబాబులు పాల్గొన్నారు. జిల్లాలోని ఆదర్శ రైతులను, హారిక కన్‌స్ట్రక్షన్ అధినేత హారిక ప్రసాద్‌ను సన్మానించారు.

తూర్పు కాపు సంక్షేమ భవన నిర్మాణానికి భూమిపూజ



తూర్పుకాపు సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తూర్పు కాపు సంక్షేమ సంఘం భవన నిర్మాణ కల నెరవేరనుందని స్థల దాతలు తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, ప్రముఖ వ్యాపారవేత్త ఇజ్జాడ శివన్నారాయణ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మామిడి స్వరూప్‌లు అన్నారు. నగరంలోని పెద్దపాడురోడ్డులో తూర్పుకాపు సంక్షేమ సంఘం సామాజిక భవన నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా తూర్పుకాపులంతా ఐకమత్యంగా ఉంటూ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి తమ జాతి ఔన్నత్యాన్ని చాటి చెప్పాలన్నారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ తమ సామాజికవర్గంలో ఐక్యతతోనే సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. హారికా కన్‌స్ట్రక్షన్స్ అధినేత హారికా ప్రసాద్ మాట్లాడుతూ అందరూ బేధాభిప్రాయాలు వీడి సమష్టిగా ఉండాలని పిలుపునిచ్చారు. సంక్రాంతిలోపే భవన నిర్మాణ పనులన్నీ మొదలుపెట్టాలని నిర్ణయించారు. పలువురు ముఖ్యనేతలు భవన నిర్మాణానికి రూ.50 లక్షలు విరాళంగా ప్రకటించారు. ఈ భవనంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు నిర్వహించి సామాజిక వర్గ యువతకు చేయూత అందిస్తామన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు సామాజిక వర్గ పెద్దలు పిసిని చంద్రమోహన్, కొమ్ము రమణమూర్తి, వానకృష్ణచంద్, గేదెల వాసుదేవరావు, పొంద్రంకి రమేష్, డోల తిరుమలరావు, కురిటి మాధవ నాగేశ్వరరావు, గొర్లె లక్ష్మణరావు, గేదెల చైతన్య, లుకలాపు అప్పలనాయుడు, చిరంజీవి, సలాడ మోహనరావు, లుకలాపు గోవిందరావు, కొమరాపు ఆఫీసునాయుడు, ఒడిసి బాలకృష్ణ, టంకాల బాలకృష్ణ, సురవరపు నాగేశ్వరరావు, ఆరిక కృష్ణ, కొండాల గణేష్, శివ్వాల తేజేశ్వరరావు, కద్దాల శ్యామ్‌సుందర్, కరణం శ్రీను పాల్గొన్నారు.

అమానుషం!

రాయగడ: కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు. నిండు గర్భిణి అని కూడా చూడకుండా భార్యను దారుణంగా హతమార్చాడు. ఈ దారుణ ఘటన రాయగడ జిల్లా బిసంకటక్ సమితి డుకుం పంచాయతీ గౌడబంగిరిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌడబంగిరికి చెందిన లక్ష్మణ్ మండంగి(28) గత ఏడాది అదే గ్రామానికి చెందిన రీతా(25)ను వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం రీతా ఎనిమిది నెలల గర్భిణి. శనివారం రాత్రి ఏదో విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో కోపో ద్రిక్తుడైన లక్ష్మణ్ ఇంటిలోని ఓ తాడును తీసుకువచ్చి భార్య మెడకు చుట్టి హత్య చేశాడు. కొద్దిసేపటి తర్వాత ఇరుగుపొరుగు వారు విషయం తెలుసుకుని రీతాను మునిగుడ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

• భోగి మంట. .సంప్రదాయమంట



నరసన్నపేట జీసీ, ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకున్నారు. భోగి మంట వేసి సందడిగా గడిపారు. - నరసన్నపేట

రూ.49 లక్షలకు టోకరాపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : గార ఎస్‌బీఐ బంగారం కేసులో ముద్దాయి ఉరిటి కిరణ్‌బాబు.. జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్‌లో ఖాతాదారుల పెట్టుబడుల సొమ్ము రూ. 49 లక్షల మేర టోకరా వేశాడని ఆ సంస్థకు చెందిన విజయవాడ సీనియర్ మేనేజర్ అలమూరు శ్రీనివాసరావు శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ చెప్పిన వివరాల మేరకు.. జిల్లా కేంద్రంగా ఉన్న ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్‌లో గత పదేళ్ల నుంచి ఆ సంస్థ ప్రతినిధిగా ఉన్న ఉరిటి కిరణ్ బాబు ఖాతాదారులకు, మ్యూచువల్ సంస్థ ప్రతినిధులకు, ఎస్బీఐ బ్రాంచిల ప్రతినిధులకు మధ్య సంధానకర్తగా నమ్మకంగా మెలిగాడు. ఈ క్రమంలో ఎస్బీఐని నమ్మి వచ్చే ఖాతాదారులతో అతను పరిచయాలు పెంచుకుని మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టాలంటూ కోరేవాడు. దీంతో అతడిని నమ్మి చాలా మంది డబ్బులు కట్టారు. గార ఎస్‌బీఐలోని బంగారం మాయం కేసులో కిరణ్‌బాబే ప్రధాన సూత్రధారి అని తేలడంతో మ్యూచువల్ ఫండ్స్‌లో అతడిని నమ్మి డబ్బులు కట్టిన వారు బ్యాంకులకు వెళ్లి తనిఖీ చేసుకోగా పెట్టుబడులు మాయమయ్యాయని తెలిసింది. దీంతో సంబంధిత బ్యాంకుల్లో ఫిర్యాదులు చేశారు. దీంతో విజయవాడ నుంచి వచ్చిన ఎస్బీఐ మ్యూచువల్ ఫండ్స్ సీనియర్ మేనేజర్ అలుమూరు శ్రీనివాసరావు గత మూడు రోజులుగా శ్రీకాకుళంలోని తమ సంస్థలో విచారణ జరిపారు. ఈ విచారణలో ఉరిటి కిరణ్‌బాబు 2020 నుంచి 2023 మధ్య కాలంలో ఖాతాదారుల పెట్టుబడుల సొమ్ము రూ. 49 లక్షల మేర మాయం చేసినట్లు తెలిసింది. దీనిపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ చెప్పారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

బూర్జ: మండలంలోని పెద్దపేట పంచాయతీ, బొమ్మిక రిజర్వాయర్ సమీపంలో ఆదివారం ఓ ఆటో బోల్తా పడి పలువురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బొమ్మిక గ్రామానికి చెందిన ఏడుగురు ప్రయాణికులు ఆటోలో తాళాడ పంచాయతీ మూర్తి గాడిగూడ చర్చికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా దారిలో రిజర్వాయర్ సమీపంలోని కొండల మధ్య ఆటో బోల్తా పడింది. దీంతో అందులో ఉన్న ఏడుగురూ గాయపడ్డారు. 108కు సమాచారం అందడంతో క్షతగాత్రులను మన్యం జిల్లా పాలకొండ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారిలో బాపన్న అనే వ్యక్తిని శ్రీకాకుళం రిఫర్ చేశారు. పాలకొండ పోలీసులు కేసు నమోదు చేశారు.

నాలుగు ఎకరాల వరి ధాన్యం కుప్పలు దగ్ధం



కాలిపోయిన వరి ధాన్యంను కాపాడుతున్న బాధితులు

జి.సిగడాం: ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట అగ్నికి ఆహుతైపోయింది. పంట కల్లంకు తెచ్చి నూర్పు చేసేందుకు సిద్ధమవుతున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ధాన్యం కుప్పలపై నిప్పులు రాలి ఒకేసారి మంటలు చెలరేగాయి. దీంతో పంట అంతా బుగ్గిపోయింది. పెంట గ్రామానికి చెందిన కిల్లారి రమణ సంబంధించిన 4 ఎకరాల వరి ధాన్యం కుప్పలు ఆదివారం కాలిపోయాయి. సుమారుగా రూ. రెండున్నర లక్షల వరకు నష్టం వాటిల్లింది. రాజాం అగ్నిమాపక శకటం వచ్చి మంటలు అదుపు చేసింది. అధికారులు స్పందించి రైతును ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ఉత్సాహంగా జిల్లా తైక్వాండో పోటీలు



విజేతలుగా నిలిచి పతకాలు, ప్రశంసా పత్రాలను అందుకున్న క్రీడాకారులతో నిర్వాహకులు, అతిథులు, రిఫరీలు



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్, శ్రీను, రాజా, వేణు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్థానిక టౌన్‌హాల్‌లో ఆదివారం జిల్లా స్థాయి సబ్ జూనియర్ పోటీలు ప్రారంభమయ్యాయి. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ముఖ్య సలహాదారుడు, సీనియర్ న్యాయవాది నౌపడ విజయ్‌కుమార్, తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి తైక్వాండో శ్రీను, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బలభద్రుని రాజాలు పోటీలను ప్రారంభించారు. రాష్ట్రపోటీలకు ఇంకా రెండు వారాల వ్యవధి ఉందని.. ఎంపికైన క్రీడాకారులంతా పూర్తిస్థాయిలో తర్ఫీదు పొందాలని వారు సూచించారు. తైక్వాండో శ్రీను మాట్లాడుతూ జిల్లా స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకి ఎంపిక చేస్తారన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో నంద్యాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు. రెండు వారాల పాటు శిక్షణ శిబిరాలను నిర్వహించి రాష్ట్రపోటీలకు సన్నద్ధం చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాపార వేత్త కర్రా భాస్కర్‌రావు, దళిత జేఏసీ నేత కంఠ వేణుగోపాల్, కన్సల్టింగ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వరరావు, చిన్నభాస్కర్ పాల్గొన్నారు. కాగా ఈ పోటీలకి న్యాయ నిర్ణేతలుగా రిఫరీలు మజ్జి గౌతమ్, పి.నవీన్, ఎస్.రవి, వి.జాస్మిన్, గణసాయి, సాయి బాలాజీ, వి.మదన్, మేఘనా, సమ్రిన్, జనార్ధన్ వ్యవహరించగా, కోచ్‌లు ఎస్.శేఖర్ (టెక్కలి), జగదీశ్వరరావు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకి మెడల్స్ అందజేత..

టౌన్ హాల్ వేదికగా జరిగిన 37వ జిల్లా స్థాయి సబ్ జూనియర్ క్యోర్గీ, 12వ పూమ్ సే బాలబాలికల తైక్వాండో పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి.

తుది వరకు హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు బంగారు, రజత, కాంస్య పతకాలతోపాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకి ఎంపికైన క్రీడాకారులకు నిర్వాహకులు, అతిథులు బెస్ట్ విశెష్ తెలియజేశారు.

'కాళింగులు ఐక్యతతో ముందుకు సాగాలి'



ఆత్మీయ సమ్మేళానికి హాజరైన కాళింగులు

మందస: కాళింగులంతా ఐక్యతతో ముందుకు సాగాలని పలువురు వక్తలు అన్నారు. మందస మండలంలోని మఖరజోల సమీపంలో కాళింగ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సమ్మేళనంలో వారు మాట్లాడుతూ కాళింగులు ఉన్నత ఆశయంతో ముందుకు నడవాలని, సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఎమ్మెల్యే బెందాళం అశోక్, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ బల్ల గిరిబాబు, కాళింగ నాయకులు కూన రవికుమార్, డాక్టర్ దానేటి శ్రీధర్, పిరియా సాయిరాజ్, గుంట కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

'అగ్నికుల క్షత్రియులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న అగ్నికుల క్షత్రియ సంఘ ప్రతినిధులు

సోంపేట:

అగ్నికుల క్షత్రియులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని సంఘ జాతీయ అధ్యక్షుడు నాగిడి సాంబశివరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా అగ్నికుల క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో బారువ గ్రామంలో అగ్నికుల క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియులకు అందాల్సిన న్యాయమైన డిమాండ్లు తీర్చడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. ప్రతి నియోజక వర్గంలో సామాజిక భవనాల నిర్మాణానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మేడా వెంకట నరసింహారావు, జిల్లా అధ్యక్షులు శివంగి వాసు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దున్న గాంధీ, పలువురు అగ్నికుల క్షత్రియ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.


దైవ నామస్మరణే ఉత్తమ సాధన



చెంచులకు ప్రసాదాన్ని అందిస్తున్న స్వామీజీ

శ్రీకాకుళం కల్చరల్: భగవంతుని నామస్మరణే అన్నింటి కంటే ఉత్తమ నామస్మరణ అని దత్తపీఠం బాలస్వామి విజయానంద తీర్థ స్వామీజీ అన్నారు. స్థానిక దత్త క్షేత్రంలో స్వామీజీ భక్తులనుద్దేశించి ఆదివారం అనుగ్రహ భాషణం చేశారు. మనలోని చైతన్యం, స్పందన పెరగాలంటే దైవ నామ స్మరణ చేయాలన్నారు. గురుబోధనలు సర్వదా అనుసరణీయమన్నారు. ముందుగా దత్తక్షేత్రంలో ఉన్న దత్తాత్రేయ స్వామిని, గణపతిని, గాయత్రీ మాతను, నవగ్రహాలను, ఆంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. దత్తహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. చెంచులను కలసి వారి ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో దత్తపీఠం ప్రతినిధులు జయలక్ష్మీ మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

జేసీఐ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



జేసీఐ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

శ్రీకాకుళం కల్చరల్: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ శ్రీకాకుళం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం అట్టహాసంగా జరిగింది. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన ఈ సభకు జేసీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు జామి భీమశంకర్ అధ్యక్షత వహించి, నూతన అధ్యక్షునిగా కూన అనిల్ కుమార్‌ను సభకు పరిచయం చేశారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు గుండ లక్ష్మీదేవి, గొంప సురేష్, కేవీ రావు, సాయి సుధీర్, గీతా శ్రీకాంత్, జి.లోకనాథం, దూసి సంతోష్, జేసీఐ పూర్వపు సభ్యులు పొట్నూరు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.